ప్రజాశక్తి

సోమవారం 28 జూలై 2025

సచివాలయ సిబ్బందికి ఘన సన్మానం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయ మండలం లోతేరు గ్రామ సచివాలయంలో బదిలీపై వివిధ ప్రదేశాలకు వెళ్తున్న సచివాలయ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. లోతేరు పంచాయతీ సర్పంచ్ గుబ్బాయి కళావతి ఆధ్వర్యంలో ఆదివారం సచివాలయ సిబ్బందికి పీసా కమిటీ సభ్యులు, అంగన్వాడి సిబ్బంది, వార్డు మెంబర్స్, ఆశ వర్కర్లు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళావతి మాట్లాడుతూ, ప్రజలకు మరింత సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కిల్లో జగన్నాధం, నాగేష్, బి రామ్మూర్తి, జి వెంకట్ రావు, పట్టాసి కొండలరావు, పేసా కమిటీ సభ్యులు కె మోహన్‌రావు, కిల్లో బీమ్మ, పంచాయితి పెద్దలు గుబాయి త్రినాథ్, పాంగి కోగేశ్వరరావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సర్పంచ్

గొడుగు పట్టుకుని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

గొడుగులు పట్టుకుని బడికి !

- వర్షంలో నడిమివలస గిరిబాలల అవస్థలు

- రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి నిత్యం కాలినడకన రాకపోకలు

-ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : మండలంలోని శిరగం పంచాయతీ నడిమివలస గ్రామంలో ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. నడిమివలస గ్రామంలో 16 మంది విద్యార్థులున్నారని,పాఠశాల లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడిపుంజువలస గ్రామంలోని పాఠశాలకు వెళ్లేందుకు గిరి బాలలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్‌లో కాలినడకన అక్కడకు వెళ్లేందుకు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి తిరిగి ఇళ్లకు చేరేంత వరకు భయభయంగా వారికోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గొడుగులు పట్టుకుని, పుస్తకాల సంచిల భారంతో బాలలంతా నడుచుకుంటూ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నడిమివలస గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని .గతంలో అనేక సార్లు ఫిర్యాదులు, వినతులిచ్చినా అధికారులు, నేతలు స్పందించడం లేదని మండిపడుతున్నారు.

పాఠశాలను ఏర్పాటు చేయండి

నడిమివలస గ్రామంలో పాఠశాల లేకపోవడంతో ఐదేళ్ల నుంచి పదేళ్లలోపు చిన్నారులు కాలినడకన రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, నేతలు, అధికారులు ఇక్కడి పరిస్థితులు పరిశీలించి తక్షణం పాఠశాల మంజూరు చేయాలి. లేకుంటే ఆందోళన తప్పదు.

ఎస్ ఐసుబాబు,
ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం పంపిణి చేసిన ప్లేట్లు గ్లాసులను ప్లేట్లు గ్లాసులను ప్రధానోపాధ్యాయుడు ఎస్ ప్రభుదాసు ఆదివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందని వీటిని విద్యార్థులు ఉపయోగించుకొని బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ఎం సుభాకర్, టీచర్స్ పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్

గోతులుగా ఉన్న వంతెన

మరమ్మతుకు నోచని వంతెన

-గోతులమయంతో వాహనదారుల అవస్థలు- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయ మండలం మాడగడ పంచాయతీ బోసుబెడ్డ, మాడగడల మధ్య పెద్ద గెడ్డ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో బ్రిడ్జి గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిండి పోయి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనదారులు, ప్రయాణికులు పనుల నిమిత్తం బస్కి, మాడగడ, సుంకరమెట్ట ,హుకుంపేట మండలం బూర్జ పంచాయతీలకు చెందిన గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు. బోసుబెడ్డ నుండి మాడగడ మంచుకొండ వ్యూ పాయింట్ వరకు సుమారు 4.5 కిలోమీటర్ల వరకు 16 కోట్లు రూపాయలతో నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం జరుగుతుంది. వంతెన నిర్మాణం కోసం మాత్రం అధికారులు మర్చిపోయారు. ఈ వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉంది. బారీ వర్షం వస్తే వంతెన వద్ద సరైన రక్షణ గోడ లేక ప్రయాణికులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు పై పెద్ద పెద్ద కంటైనర్ వాహనాలు, టిప్పర్ లారీలు నిత్యం మట్టి, రోడ్డు నిర్మాణ ముడిసరుకులు తీసుకెళ్తుంటారు. దీంతో ఈ రోడ్డుపై రద్ది పెరుగుతుందని, వంతెన పై గుంతలు ఏర్పడి ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
వర్షాకాలంలో పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉంటుంది. గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పకైనా అధికారులు ప్రమాదాలు జరగక ముందే నూతన బ్రిడ్జి నిర్మాణం చేయాలని వాహనదారులు,పాదచారులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

రోడ్డు చేసి బ్రిడ్జి నిర్మాణం అధికారులు మర్చిపోవడం ఎంతవరకు సమంజసమని వార్డు సభ్యులు వంతల డేవిడ్ అన్నారు. బోసుబెడ్డ నుండి మాడగడ వ్యూ పాయింట్ వరకు 4.5 కిలోమీటర్లు వరకు నిధులు కేటాయించి బ్రిడ్జి నిర్మాణం కోసం ఎందుకు అధికారులు మర్చిపోయారని ప్రశ్నించారు. 2024 సంవత్సరంలో మాడగడ పంచాయతి సర్వసభ్య సమావేశంలో గుత్తేదారుడుకి రోడ్డు పనులు ఎప్పుడు లోగా పూర్తి చేస్తారని అడిగినప్పుడు గత డిసెంబర్ లోపు రోడ్డు పూర్తి చేసి అప్పజెప్తామని చెప్పడం జరిగిందన్నారు. కానీ నేటి వరకు రోడ్డు పనులు పూర్తి చేయలేదన్నారు. మాడగడ వ్యూ పాయింట్ వరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులు త్వరితిగతిన పూర్తి చేసి ప్రజలకు, పర్యాటకులకు సౌకర్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి మాడగడ, బోసుబెడ్డ నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని కోరారు.

వంతల డేవిడ్,
14వ వార్డు సభ్యులు.
మాడగడ పంచాయతీ.
అరకులోయ మండలం

తగ్గిన గోదావరి

ప్రజాశక్తి - విఆర్.పురం: మండలంలో గోదావరి నీటిమట్టం శనివారం భద్రాచలం వద్ద రాత్రికి 35.60 అడుగులకు చేరింది. ఆదివారం ఉదయానికి నిలకడగా ఉన్న గోదావరి మధ్యాహ్నం నుండి తగ్గుతూ సాయంత్రం నాలుగు గంటలకు 35.20కి చేరుకుంది. తక్షణమే ప్రభుత్వం కాంటూర్ లెక్కలతో పని లేకుండా ప్రతి ఒక్కరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ స్ట్రక్చర్ వ్యాలీస్ ఇచ్చి ఇక్కడ నుండి తరలించాలని డిమాండ్ చేశారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి -విఆర్‌పురం: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కూనవరంలో జరిగే 'కోయ్‌త్తోర్ పండూం దక్కట్ కూనవరం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం పూనెం ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దఎత్తున ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో కూడిన కళానత్యాలు, రేలా ఆటలు,పాటలు ప్రదర్శించబడతాయని, ఆదివాసీలంతా కూనవరం తరలిరావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విఆర్‌పురం కూనవరం, ఎటపాక, చింతూరు మండలాల నుంచి ఆదివాసీ నాయకులు ప్రజాప్రతినిధులు ఉద్యోగస్తులు మేధావులు యువత అంతా పాల్గొంటున్నారని తెలిపారు. ఇప్పటికే ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని మన సాంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క ఆదివాసీపై ఉందని వాటిని కాపాడుతూనే మన హక్కులు చట్టాల అమలుపై ఉద్యమించాలని ఆయన అన్నారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్‌బాబు, బోరయ్య, కారం నాగేష్, మొట్టుం రాజయ్య, పులి బొజ్జి, కారం సుందరయ్య, పోడియం శ్రీరామమూర్తి, సుబ్బారావు, లింగాపురం సర్పంచ్ సోడి శంకర్, కారం సత్తిబాబు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సీలేరు విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి -సీలేరు: విజయవాడలో నిర్వహించిన క్లస్టర్‌స్థాయి క్రీడా చెస్, రన్నింగ్, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని జికె వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ డిఎవి ఆధ్వర్యంలో జాతీయస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా ముందుగా క్లస్టర్‌స్థాయి పోటీలు నిర్వహించారని ఇందులో సుమారు 10 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. చెస్, రన్నింగ్ కబడ్డీ పోటీల్లో విద్యార్థులు చక్కటి ఆటతీరు ప్రదర్శించి త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి పాఠశాల ఖ్యాతిని నిలిపారని ప్రశంసించారు. అండర్ -14 విభాగంలో నాలుగోతరగతి విద్యార్థి చాణక్య చెస్‌లో ద్వితీయ స్థానంలో నిలవగా, 100 మీటర్ల రన్నింగ్ రేసులో తొమ్మిదో తరగతి విద్యార్థి అర్నబ్ విశ్వాస్ ద్వితీయస్థానం సాధించారన్నారు. బాలుర కబడ్డీ పోటీల్లో 7,8,9 తరగతి విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారని పేర్కొన్నారు. అదేవిధంగా అండర్ -17 విభాగంలో పదోతరగతి విద్యారిన్థి కె.వాసవి 200 మీటర్స్ రన్నింగ్ రేస్‌లో ప్రథమస్థానం, 100 మీటర్స్ రన్నింగ్‌లో తృతీయ స్థానం, తొమ్మిదో తరగతి విద్యార్థి బి.నితిన్‌కుమార్ 100 మీటర్స్ రన్నింగ్‌లో ప్రథమస్థానంలో నిలిచారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు వన్నెతెచ్చిన విద్యార్థులకు డిఎవి పాఠశాల ఎల్‌ఎంసి చైర్మన్ ఎపి జెన్కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి పిఇటి కమలాకర్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశంసించారు.

ఉపాధ్యాయుడు కొండబాబుకు జాతీయస్థాయి అవార్డు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న మిరియాల కొండబాబుకు జాతీయ స్థాయిలో ఆర్ట్ ఎక్స్‌పర్ట్ (కళా నిపుణుడు) అవార్డ్, అలాగే బెస్ట్ ఆర్ట్ టీచర్ అవార్డ్ వచ్చాయి. ఆదివారం రాజమహేంద్రవరంలో వి.విభగీరధి 125వ జన్మదిన వేడుకల్లో భాగంగా భగీరధి ఆర్ట్ ఫౌండేషన్ ఆరోవార్షికోత్సవం సందర్భంగా చిత్రకారులకు, యంగ్ ఆర్టిస్టులకు జాతీయస్థాయి ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ పోటీలకు చెన్నై, హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు, విశాఖపట్నం, ఖమ్మం, శ్రీరంగపట్నం, వరంగల్, గుడివాడ, అనకాపల్లి, రాజమండ్రి వంటి వివిధ జిల్లాల నుండి ఆర్టిస్టులు చిత్రించిన చిత్రాలు ప్రదర్శించారు. వీటిలో కొండబాబు చిత్రానికి ఈ అవార్డులు దక్కాయి. రాజమండ్రిలో చందా సత్రం వేదికగా బహుమతి ప్రదానం జరిగింది. ఆర్ట్‌ఎక్స్‌పర్ట్ అవార్డుకు నగదు, షీల్డ్‌ను రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ, కొరసాల సీతారామస్వామి చేతుల మీదుగా అవార్డ్‌ను అందుకున్నారు.

అవార్డు అందుకుంటున్న కొండబాబు

ఘనంగా సిఆర్‌పిఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - వై.రామవరం: వై.రామవరంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నందు సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో ఆదివారం 87వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమాండర్ ఎం.రాధ మాట్లాడుతూ, విధి నిర్వహణలో పోలీసుల పనితీరును అభినందిస్తూ ఒకరికి ఒకరు సెల్యూట్ చేసుకుని ఆప్యాయంగా కౌగిలించుకుంటూ స్నేహభా వాన్ని తెలియపరచుకున్నారు. కమాండర్ సుధాకర్, బి.రామకష్ణ, ఎస్ఐ పాల్గొన్నారు.

కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యే శిరీషాదేవికి అభినందనలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘ కమిటీ చైర్పర్సన్‌గా ప్రభుత్వం నియమించడం పట్ల మండల టిడిపి నేతలు ఘనజాల తాతారావు తదితరులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు అభినందనలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం గిరిజనులకు, గిరిజన ప్రాంత అభివృద్ధికి చేపట్టబోయే ప్రణాళికలో ఎమ్మెల్యే ముద్ర ఉండడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతులు పొంది, రాష్ట్రమంత్రిగా సేవలందించే స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మాజీ సొసైటీ అధ్యక్షులు టిడిపి నేత గణజాల తాతారావు తెలిపారు.

కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్, మాజీ మండల పార్టీ ప్రాధాన కార్యదర్శి మాజీ జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర చైర్మన్ కోసూరిబుజ్జిచిన్నాలమ్మ, మాజీ జడ్పీటీసీ కంతపురెడ్డి వీరబాబు, జడ్డంగి టిడిపి అధ్యక్షుడు తమదాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		

వాగుపై కర్రల వంతెన

- శాశ్వత బ్రిడ్జి నిర్మించాలని వేడుకోలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని తమ్మెంగుల పంచాయతీ పరిధిలోని కుమ్మరి వంచుల గ్రామానికి వెళ్లే ప్రధాన వాగుపై శాశ్వత వంతెన లేక పోవడంతో వర్షాకాలం రాగానే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్నవరం పంచాయతీ కొత్తూరు బయలు గ్రామం నుంచి తమ్మెంగుల పంచాయతీ కుమ్మరి వంచుల గ్రామాలకు వెళ్లే రహదారి వాగు ఉప్పొంగినప్పుడు పూర్తిగా నిలిచిపోతుంది. ఈ కారణంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు ప్రాణాలను పణంగా పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో స్థానిక గ్రామస్తులు కలసికట్టుగా శ్రమదానంతో తాత్కాలిక కర్రవంతెన నిర్మించారు. ఈ వంతెన ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రాణనష్టం జరిగిన తర్వాతేనా అధికారులు స్పందిస్తారు? అని వారు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిలో బాలన్న, కిలో దీనబంధు, వంతల విక్రమ్, వంతల రాజారావు, కిలో చందు తదితరులు విజ్ఞప్తి చేశారు. శాశ్వత వంతెన నిర్మించబడితే కొత్తూరుబయలు, కుమ్మరి వంచుల గ్రామాలతో పాటు సుమారు ఎనిమిది గ్రామాలకు రాకపోకలు సులభతరం అవుతుందని వారు తెలిపారు. స్థానికులు, రైతులు, యువకులు శ్రమదానంతో కర్రవంతెన నిర్మాణానికి సహకరించినప్పటికీ ఇది శాశ్వత పరిష్కారం కాదని స్పష్టంగా చెబుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి శాశ్వత వంతెన నిర్మించకపోతే ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరగవచ్చు అని వారు హెచ్చరిస్తున్నారు

కర్రల వంతెనను నిర్మిస్తున్న స్థానికులు

నినాదాలు చేస్తున్న విద్యార్థులు

పాఠశాలలో సమస్యలపై నిరసన

ప్రజాశక్తి- హుకుంపేట:గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలుర పాఠశాలలో సమస్యలపై ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజశేఖర్ మాట్లాడుతూ, మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ భవనాన్ని ప్రస్తుతం గిరిజన సంక్షేమ పాఠశాల అవసరాల కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఇంటర్మీడియట్, స్కూల్ విద్యార్థులు ఒకే భవనంలో నివాసం ఉండాల్సి రావడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. భోజనాల కోసం డైనింగ్ హాల్ లేక పోవడంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాలలో భోజనం చేయాల్సి వస్తోందన్నారు. అధికారులు వెంటనే స్పందించి అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ, సహాయ కార్యదర్శి తనీష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పడకేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

- మరమ్మతుకు నోచని వాహనాలు
- సిబ్బందికి చెల్లించని వేతన బకాయిలు

టైర్లు లేని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలు మరమత్తులకు గురై మూలన పడుతున్నాయి. వీటి నిర్వహణ చూడాల్సిన అరబింద్ సంస్థ యాజమాన్యం పట్టించు కోకుండా చాలా నిర్లక్ష్యం చేస్తోంది. అల్లూరి జిల్లా ఏజెన్సీ వ్యాప్తంగా మొత్తం 24 తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ లు ఉన్నాయి. పాడేరులో 3 వాహనాలు ఉన్నప్పటికీ ఒకటి మరమ్మతులకు గురై పనిచేయలేదు. హుకుంపేట లో ఉన్న ఒక్క వాహనం మూలన చేరింది. జి మాడుగుల లో 2 వాహనాలు పని చేయడం లేదు. పెదబయలులో ఒక్క వాహనం, ముంచంగి పుట్టులో 2 వాహనాలు పనిచేయడం లేదు. చింతపల్లి 2 వాహనాల్లో ఒకటి గూడెం కొత్త వీధిలో ఒకటి మూలకు చేరాయి.

ఏజెన్సీలో ఈ వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది 11మంది ఉన్నారు. వాహనాలు మరమ్మతులకు గురవడంతో పాటు, వాహనాలకు టైర్స్ లేకపోవడం, జెట్ క్రాస్ పనిచేయకపోవడంతో మూలకు చేరుతున్నాయి. ఈ విషయంపై సంస్థ యజమాన్యానికి తెలియపరిచిన కనీసం స్పందించక పోవడం చాలా దుర్మార్గ మని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ విమర్శించారు: ఏజెన్సీ ప్రాంతంలో తల్లి బిడ్డను క్షేమంగా వాళ్ళ ఇంటికి చేర్చేందుకు వినియోగ పడుతున్న ఈ వాహనాలు మరమ్మత్తుల గురై మూలకు చేరుతున్నాయి. సిబ్బందికి నాలుగు నెలలుగా జీతభత్యాలు లేకపోవడంతో రూమ్ రెంట్లు, కరెంటు బిల్లులు కట్టుకోలేక, పిల్లల చదువులు ఫీజులు చెల్లించుకోలేక కుటుంబ పోషణ గడవక అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది.తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ లను మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేశారు

పెదపాడులో తాగునీటి ఎద్దడి

- మరమ్మతుకు నోచని కుళాయిలు
- ఇబ్బంది పడుతున్న పివిటిజి గిరిజనులు

కుళాయిల మరమ్మతు చేయాలని వేడుకుంటున్న యువకులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కొర్ర పంచాయతీ పెదపాడు పివిటిజి గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో ఆ గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో గతంలో గ్రావిటీ పథకం నిర్మించి కుళాయిల ద్వారా తాగునీటి ఇస్తున్నారు. గత కొద్ది రోజులుగా గ్రావిటీ కొళాయిలు మరమ్మతుకు గురవ్వడంతో ఆ గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. తప్పని పరిస్థితుల్లో ఆ గ్రామానికి సమీపంలోని గెడ్డల నీటిని సేకరించి గిరిజనులు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఊట గడ్డలోని నీరు బురద మయంగా ఉండడంతో ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతుకు గురైన గ్రావిటీ పథకాన్ని బాగు చేసి తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు.

వెంటనే మరమ్మతు చేపట్టాలి:

పెదపాడు గ్రామంలో గ్రావిటీ పథకాన్ని మరమ్మత్తు చేసి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ వార్డు సభ్యుడు బసన్న, గ్రామస్తులు జగన్నాథం, రామకృష్ణ డిమాండ్ చేశారు. తాగునీటి కొరత ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు రామన్న, రామరాజు పాల్గొన్నారు.

మధుర మామిడిలో కేథలిక్ స్కూల్

ప్రజాశక్తి- జి మాడుగుల

మండలం సొలభం పంచాయతీ మధురమామిడి గ్రామంల శ్రేయాస్ డియోసిస్ బేతరీ వైనాడు, కేరళ సహకారంతో మలయంగార్ కేథలిక్ చర్చిఆధ్వర్యంలో పాఠశాల, కమ్యూనిటీ హాల్, హాస్పిటల్‌ను సొలబం సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎంపిటిసి చిన్నారావు, జిమాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు ప్రారంభించారు.కార్యక్రమంలో ఫాదర్స్ స్టీఫెన్, మోబిన్, సిస్టర్స్ జూడిట్, జూలియన్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోడి పందెం శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ చీమల వెంకటాపురంలో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుండి రూ.18,320 నగదు, రెండు కోళ్ళు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -గోపాలపట్నం : గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని విశ్వసనీయ సమాచారం మేరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు ఆధ్వర్యాన పోలీసులు నార్త్ సింహాచలం రైల్వే క్వార్టర్స్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలు రాధికా సేతి, మృత్యులమ్మ హండాల రెండు సూట్‌కేసులతో వెళ్తున్నారు. సూట్ కేసులను తనిఖీ చేయగా అందులో మొత్తం 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం

'నవోదయ దరఖాస్తుల గడువు పెంచాలి'

ప్రజాశక్తి-మధురవాడ : జవహర్ నవోదయ విద్యాలయం 5వ తరగతి ప్రవేశాల గడువును పెంచాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రితో పాటు, నవోదయ విద్యాలయ సంస్థ ప్రధాన కార్యాలయానికి లేఖలు రాసినట్టు చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం తెలిపారు. విశాఖ జిల్లాలో గత ఏడాది 9088 మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 29వ తేదీతో గడువు ముగుస్తున్నా ఈ ఏడాది ఇప్పటివరకు 2355 మంది మాత్రమే దరఖాస్తులు చేశారని తెలిపారు.

ఆకట్టుకున్న బుద్ధునితో నా ప్రయాణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకం ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయం అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. లతా - రాజా ఫౌండేషన్ (హైదరాబాద్) రూ.50 లక్షల వ్యయంతో నిర్వహించిన ఈ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఈ నాటకంలోని సన్నివేశాలు ఎంతగానో ఆలోచింపజేశాయి. దు:ఖం, పేదరికం, హింసకు మూలాలను, వాటికి విముక్తి మార్గాన్ని నాటకంలో చూపారు. నాటక ప్రదర్శనను విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం ప్రతిని వంశీకృష్ణ బహూకరించారు. కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జెవి.ప్రభాకర్, బత్తుల గౌతమ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పథకాలు అమలులో ఇగో దేనికి?

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరి విధంగా గత ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న పథకాలు అమలు చేయలేక చంద్రబాబు ఏడాదిలోనే ప్రజావ్యతిరేకత ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. 41వ వార్డులో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో జ్ఞానాపురం వైసిపి కార్యాలయం వద్ద ఆదివారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గణేష్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు చేసిన అరాచక పాలనను నిరసిస్తూ నేడు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా అధికంగా ప్రజానీకం హాజరు కావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తేటతెల్లమవుతుందన్నారు. జగన్‌పేరు, ఆయన ఫోటో కానీ కనిపించకూడదని ఆయన అందించిన సంక్షేమ పథకాలు కూడా ఇగోతో పేదలకు అందజేయకపోవడం దారుణమన్నారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ 41వ వార్డులో వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, బిసి విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, 42 వ వార్డు అధ్యక్షుడు భీసెట్టి ప్రసాద్ క్రిస్టియన్ మైనార్టీ సెక్రటరీ విభాగం వేలంగినిరావు పాల్గొన్నారు.

మల్లాది శ్రీకాంత్‌కు ఎయు డాక్టరేట్

మల్లాది శ్రీకాంత్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం పరిశోధక విద్యార్థి మల్లాది శ్రీకాంత్‌కి ఎయూ డాక్టరేట్ లభించింది. 'ఉద్యోగి జీవిత చక్ర నిర్వహణ మరియు సంస్థ పనితీరుపై దాని ప్రభావం' అనే అంశంపై ప్రొఫెసర్ పుట్టపల్లి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిపిన పరిశోధనకు ఆయన డాక్టరేట్ పొందారు. ఈ మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ని పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు. మల్లాది శ్రీకాంత్ 2014లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంహెచ్ఆర్ఎం విభాగంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు. 1992లో గ్రాడ్యుయేషన్ అయ్యాక, 1993 నుండి డాక్టర్ రెడ్డీస్‌లో ఉద్యోగం పొందారు. రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్‌లో 31 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం లీడ్ ఎంప్లాయ్ రిలేషన్స్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

నేడు కలెక్టరేట్‌కు రెవెన్యూ మంత్రి అనగాని

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రానున్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తరపున డిఆర్ఓ బి.హెచ్.భవానీశంకర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ మంత్రి ప్రజలకు అందుబాటులో ఉండి, నేరుగా వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

మరమ్మతులకు గురైన మంచినీటి ట్యాంకు, పాడైన వీధిలైట్

తాగునీరు, వీధి లైట్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-చింతూరు:మండలంలోని ఉలుమూరు మల్లెతోట గ్రామాల్లో మంచినీరు, వీధి లైట్ల సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు వేడుకుంటున్నారు. గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకు మరమ్మతులకు గురికావడంతో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్తులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ సచివాలయ కార్యదర్శిని కోరారు. పంచాయతీ వద్ద డబ్బులు లేవని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని, దీంతో తామేమీ చేయలేకపోతున్నామని చెప్పారు. ఇక గ్రామంలో వీధిలైట్లు లేక గ్రామస్తులు చీకట్లో మగ్గుతున్నారు. అటవీ ప్రాంతం దగ్గర కావడంతో విష కీటకాలు సంచరిస్తున్నాయని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మంచినీటి ట్యాంకుకు మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని, వీధి లైట్లు వేయాలని ఐద్వా నాయకురాలు శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

విశాఖ జిల్లా హెచ్‌డబ్ల్యుఒల కార్యవర్గం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాష్ట్రస్థాయి హెచ్‌డబ్ల్యూఒల సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా హెచ్‌డబ్ల్యూఒల యూనియన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల్లో విశాఖ జిల్లా హెచ్‌డబ్ల్యూఒలో జిల్లా అధ్యక్షునిగా జి.ఎస్.ప్రకాష్ , జనరల్ సెక్రెటరీగా ఈర్ల గోవింద్, జిల్లా ట్రెజరర్ గా పెంటకోట అనురాధ, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా పి.మోహిని ఎన్నికయ్యారు. వసతిగృహ సంక్షేమ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

ఆందోళన చెందుతున్న గ్రామస్తులు
పట్టించుకోని అధికారులు

రాళ్లు తేలిన ఆముదల బంద రోడ్డు

రక్షణ గోడ లేని నెల్లిపూడి వంతెన

ప్రజాశక్తి - గంగవరం: గంగవరం నుండి గోకవరం వెళ్లే ప్రధాన రహదారి నెల్లిపూడి వంతెనపై రక్షణగోడ నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో వరద వచ్చినప్పుడు వంతెనపై నుండి వరద నీరు ప్రవహిస్తోంది. రక్షణగోడ లేకపోవడం వలన ప్రయాణికులు ఆ దారిలో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. గతఏడాది ఈ వాగు పొంగి ఒక వాహనచోదకుడు మృత్యువాత పడ్డాడు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. గంగవరం నుండి కొత్తపల్లి వరకూ రోడ్డు వేసేటప్పుడు మూడు బ్రిడ్జిలు నిర్మించారు. కానీ ఈ నెల్లిపూడి బ్రిడ్జి కట్టకపోవడం గమనార్హం. మండల కేంద్రంలో ఆముదాలబంద, కుసుమరాయి, రామదేవపురం, రామవరం, వెళ్లే రహదారి గుంతలు, రాళ్లు ఉండడం వల్ల ఇబ్బందులకు ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో రోడ్డు ఇబ్బందికరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ఈ సమస్య పరిష్కారం కావడం లేదని వారు అంటున్నారు. ఆముదలబంద రోడ్డు మంజూరైనప్పటికీ పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని గ్రామస్తులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్డు నిర్మాణం గురించి గ్రామసభ జరగకుండా అడ్డుకోవడం జరిగిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గవర విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గణబాబు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేవలం విద్యతోనే ఉన్నతస్థాయి గౌరవం లభిస్తుందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు (పిజివిఆర్ నాయుడు) అన్నారు. కేంద్ర గౌరీసేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం ఆశీర్వాద కళ్యాణ మండపంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రధాన కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, జార్ఖండ్ విసి ఆచార్య సూరిశెట్టి జవహర్, గౌరవ అతిథులుగా హాజరై ముందుగా గౌరీమాతకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ కేంద్ర గౌరీసేవా సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రతిభా ప్రోత్సాహానికి మాత్రమే అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో జరగాలని ఆకాంక్షించారు. విసి ఆచార్య సూరిశెట్టి జవహర్ మాట్లాడుతూ కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులతో పాటు గురువులకు,పెద్దలకు ముందు గౌరవం ఇవ్వాలన్నారు. విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. బుద్ధ శివాజీ మాట్లాడుతూ చదువులో వెనుకపడుతున్న గౌరీయులందరినీ అత్యుత్తమ స్థాయిలో చూడాలన్నదే తమ సంఘం లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానం చేసి, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మళ్ళ భాస్కరరావు, రిజిస్ట్రార్ పీలా సుజాత, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బుద్ధ రమేష్, డాక్టర్ రాపేటి రాజబాబు, కాళ్ల దివాకర్, పెంటకోట వెంకటరావు, కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి,శరగడం రాజశేఖర్, దాడి రమేష్, కార్యదర్శి అడారి లచ్చ అప్పారావు,కోశాధికారి కె.వి.కె శ్రీనివాసరావు, బొడ్డేటి అప్పారావు, సూరిశెట్టి లక్ష్మి, బొడ్డేటి జగ్గాయమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'గ్లోబల్ టూర్స్ అండ్ అట్రాక్షన్స్' విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: భారతదేశంలోని ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ బ్రాండ్, టూర్స్‌అండ్ అట్రాక్షన్స్ బుకింగ్ విభాగాన్ని ప్రారంభించినట్లు మేక్‌మైట్రిప్ డైరెక్టర్ రాజేష్ మాగోవ్ తెలిపారు. ఆదివారం విశాఖలోని ఓ ప్రవేటు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రయాణికులకు 130 దేశాల్లోని 1100 నగరాల్లో 2 లక్షలకు పైగా బుక్ చేయదగిన సులభమైన యాక్సెస్‌ను లభిస్తుందని, విహార యాత్రల నుంచి సాంస్కృతిక టూర్లు, థీమ్ పార్కుల నుండి అడ్వెంచర్ యాక్టివిటీల వరకూ విస్తృత శ్రేణి అనుభవాలను ఈ ప్లాట్‌ఫామ్ అందిస్తోందన్నారు.

మేక్ మై ట్రిప్ అన్ని అంశాలను ఒకే ఇంటిగ్రేటెడ్ ఇంటర్‌ఫేస్‌లో సమీకరించి, ప్రపంచ అనుభవ ప్రణాళికను మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆయన అన్నారు.

ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు రాజవొమ్మంగి సర్పంచ్

గొల్లపూడి రమణి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ఆగస్టు 15న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనేందుకు రాజవొమ్మంగి సర్పంచి గొల్లపూడి రమణిని ఎంపిక చేశారు. రాష్ట్రంలో ఇలా 10 మందిని ఎంపిక చేయగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఈమె ఒక్కరే ఎంపిక కావడం విశేషం. జైశక్తి.క్యాచ్‌దరైన్‌లో భాగంగా పంచాయతీలలో సిసి రహదారుల నిర్మాణం, తాగునీటి సదుపాయం, డ్రైన్ల నిర్మాణం, పారిశుధ్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ రమణి డిగ్రీ, బిపిఇడి పూర్తి చేయగా, భర్త రాంబాబు కోరుకొండ మండలం బుచ్చంపేట ఎంపిపి పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్నారు. తండ్రి కృష్ణ బడదనాంపల్లి ఉప సర్పంచ్, పర్సనల్ ఇంచార్జి గా పనిచేశారు. సోదరుడు పెద్దిరాజు లబ్బర్తి ఎంపిటిసిగా, అతడి భార్య బడదనాంపల్లి సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవికి, ఎంపిటిసి పెద్దిరాజుకి, అధికారులకు రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి హయాంలోనే నకిలీ మద్యం

- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి హయాంలో నకిలీ మద్యం విక్రయించారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో పది లక్షల కోట్ల అప్పులు చేశారని చెప్పారు. విశాఖకి వచ్చిన లూలు సంస్థను తరిమేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రావడంతో, పదిలక్షల కోట్లు పెట్టుబడులు,పది లక్షలు ఉపాధి అవకాశాలు వస్తున్నాయని, హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో అలాగే చేస్తున్నామన్నారు. రెవెన్యూ సమస్యలు తీర్చేలా ఒక మంత్రి వర్గ ఉపసంఘం పనిచేస్తోందన్నారు. భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమవారం విశాఖ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హుద్‌హుద్ సమయంలో చంద్రబాబు చేసిన సేవను విశాఖ ఉత్తరాంధ్ర వాసులు మర్చిపోలేదని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ వచ్చే ఏడాది పూర్తి చేస్తామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో అర్సిలర్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ తీసుకొస్తున్నారన్నారు.లోకేష్ నాయకత్వంలో టివిఎస్,కాంటిజెంట్ తో పాటు మరో రెండు కంపెనీలు వస్తున్నాయన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు దువ్వారపు రామారావు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివద్ధి ఎన్‌డిఎ అజెండా అన్నారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు,రాష్ట్ర కార్యదర్శి లోడగల కృష్ణ పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు వై.రాజు

ఆటో స్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారు కోరుకున్న ప్రదేశానికి అతి తక్కువ చార్జితో గమ్యానికి చేర్చే మంచి సాధనం ఆటో అని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. ఆదివారం కృష్ణా గార్డెన్స్‌లో దుర్గా టెంపుల్ వద్ద విశాఖపట్నం జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు కర్రి గణేష్ ఆధ్వర్యంలో కొత్త ఆటోస్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాల కోసం ఈ ఆటోస్టాండ్ ప్రారంభించడం జరిగిందన్నారు. భవన నిర్మాణకార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఈ ఆటోలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు నాయుడు మహేష్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.